# వీరశైవ లింగాయత్ ఐక్యవేదిక రాష్ట్ర మహాసభకు మొదలైన సన్నాహాలు

బిచ్కుంద, బతుకమ్మ :వీరశైవ లింగాయత్ ఐక్యవేదిక తెలంగాణ హడక్ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 9న జరగనున్న రాష్ట్రస్థాయి మహాసభను ఘనంగా నిర్వహిం చేందుకు సన్నాహాలు ప్రారంభమ య్యాయి. ఆదివారం హైదరాబా ద్‌లోని సోమయప్ప మఠంలో హడక్ కమిటీ అధ్యక్షులు సోమయప్ప మహా స్వామీజీ అధ్యక్షతన ముఖ్య సమావే శం జరిగింది. ఈ సమావే శానికి కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ హాజరై మాట్లా డారు. సమావేశంలో 2026 ఆగస్టు 9వ తేదీన రాణిగంజ్ శంకరమఠంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వీరశైవ లింగాయత్ ఐక్యవేదిక మహాసభ నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు, నాయకులు పాల్గొనేలా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సమాజ ఐక్యత, సంఘ బలోపేతం, యువత భాగస్వామ్యం, భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, వీరశైవ లింగాయత్ సమాజ ఐక్యతకు ఇటువంటి రాష్ట్రస్థాయి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మహాసభ విజయానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వీరశైవ లింగాయత్ తెలంగాణ హడక్ కమిటీ సభ్యులు, వివిధ జిల్లాల ప్రతినిధులు, సంఘ నాయకులు పాల్గొని మహాసభ విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.



# బిచ్కుందలో సెంట్రల్ లైటింగ్ రోడ్డు పనులు వేగవంతం

### ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆధ్వర్యంలో అభివృద్ధి

### మున్సిపల్ చైర్మన్ సీమ రమేష్ షట్కార్ పరిశీలన





బిచ్కుంద, బతుకమ్మ :కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలోనే జుక్కల్ నియోజకవర్గంలో కూడా అనేక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆధ్వర్యంలో బిచ్కుంద పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ రోడ్డు అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ సీమ రమేష్ షట్కార్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్డు లెవలింగ్, లైటింగ్ ఏర్పాట్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, యువ వికాసం వంటి పథకాలను నియోజకవర్గ వ్యాప్తంగా విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. వీటితో పాటు పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, రాత్రి సమయంలో సురక్షిత ప్రయాణం కోసం సెంట్రల్ లైటింగ్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వతీకరించాలి

### ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వై.ఓమయ్య



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :రాష్ట్రంలో అమలవుతున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, థర్డ్ పార్టీ విధానాలను రద్దు చేసి ఉద్యోగులను శాశ్వతీకరించాలని లేదా కాంట్రాక్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నూతన జిల్లా అధ్యక్షుడు వై.ఓమయ్య డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్త అంబేద్కర్ భవనంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 22వ జిల్లా మహాసభ సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాసభ అనంతరం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు వై.ఓమయ్య సమావేశ వివరాలను వెల్లడించారు. ఈ మహాసభకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్మికుల సమస్యలు, ప్రభుత్వ కార్మిక విధానాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీలు, ఆటో కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. అలాగే స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి నెలకు రూ.26 వేల కనీస వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, గ్రాట్యుటీ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలను అమలు చేయాలని తీర్మానించారు. జిల్లాలో స్థానిక నిరుద్యోగులకు పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో మొదటి ప్రాధాన్యత కల్పించాలని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులకు తెలంగాణ కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, బీడీ పరిశ్రమపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులో ఉద్యమాలు చేపట్టాలని మహాసభ నిర్ణయించింది. ఈ సందర్భంగా 44 మంది సభ్యులతో కూడిన నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా వై. ఓమయ్య, ప్రధాన కార్యదర్శిగా పిన్నిల హనుమాన్లు, ఉపాధ్యక్షులుగా టి.చక్రపాణి, రాజన్న, కవిత, అంజయ్య, చందర్, సహాయ కార్యదర్శులుగా సంజీవ్, అనిల్, దేవేందర్, భాగ్యలక్ష్మి, గోవర్ధన్, సంపత్, కోశాధికారిగా ఎస్.డి.ఫెరోజ్, అదనంగా కార్యవర్గం, కౌన్సిల్ సభ్యులను కూడా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సమావేశంలో సంజీవ్, అనిల్, చందర్, గోవర్ధన్, ఫెరోజ్, రాధా కుమార్, లాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తే చర్యలు

### తహసీల్దార్ లత హెచ్చరిక




మహమ్మద్ నగర్, బతుకమ్మ :ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ లత హెచ్చరించారు. మహమ్మద్ నగర్ మండలంలోని హసన్ పల్లి గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్ 70/1లోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేస్తున్నారని గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లత మాట్లాడుతూ, సంబంధిత భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిలో వరి నాట్లు వేయవద్దని ముం దుగా సమాచారం ఇచ్చినప్పటికీ, సూచనలు పట్టించుకోకుండా వరి నాట్లు వేయడంతో ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరిం చారు. అలాగే ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఎవరైనా తొలగిస్తే వారిపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# వర్షాభావ పరిస్థితులపై ఇరిగేషన్ అధికారులతో తక్షణ సమీక్ష నిర్వహించాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పంటల సాగు, సాగునీటి సరఫరాపై ఇరిగేషన్ శాఖ అధికారులతో తక్షణమే సమీక్ష సమావేశం నిర్వహించాలని బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేంకు ఆయన కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ఇందూరు జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దినేష్ కులాచారి తెలిపారు. ఇప్పటికే లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయినా, వర్షాలు లేకపోవడం, ప్రాజెక్టుల నుంచి సాగునీరు సక్రమంగా అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాన్సువాడ, బోధన్ ప్రాంతాల్లో రైతులు పెట్టుబడులు పెట్టి వరి సాగు చేపట్టినప్పటికీ నీటి కొరత కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో రైతులు బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారని, అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్లు ఎండిపోతున్నాయనీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి నిర్వహణపై ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించకపోవడం బాధాకరమని దినేష్ కులాచారి అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోని నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలని ఆయన కోరారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో ఉన్న నీటి నిల్వల నుంచి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఏ మేరకు, ఎప్పటి నుంచి సాగునీరు విడుదల చేస్తారో రైతులకు స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లాలో పంటల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో అంచనా వేసి, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తక్షణ కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు. రైతులు ఆందోళన చెందకుండా వారికి ప్రభుత్వం అండగా నిలవాలని దినేష్ కులాచారి కోరారు.

# చిగుళ్ల సమస్య గుండెదాకా..



మనం కొన్ని సమస్యల్ని చిన్నవే కదా అనుకుంటాం. పెద్దగా పట్టించుకోం కూడా. అయితే చిగుళ్ల సమస్యకు కారణమయ్యే ఒక రకం బ్యాక్టీరియా గుండె కవాటాలను దెబ్బ తీస్తున్నదని ఓ పరిశోధన వెల్లడించింది. ఇటీవల అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఓ సదస్సులో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. కాల్సిఫిక్ ఆరోటిక్ వాల్వ్ స్టెనోసిస్ అనేది చాలా మందిలో కనిపించే గుండె జబ్బు. శ్వాస సరిగ్గా అందక పోవడం, గుండెల్లో దడ, ఛాతీనొప్పిలాంటి రకరకాల సమస్యలు ఉంటాయిందులో. బృహద్ధమని కవాటంలో క్యాల్షియం పేరుకు పోయి గోడలు మందంగా అయ్యి, దీని ద్వారా శరీరానికి రక్తాన్ని పంపు చేయడం కఠినతరం అవుతుంది. దీనివల్ల కళ్లు తి రిగి పడిపోవడం, కొన్నిసార్లు ప్రాణాలే పోవడం కూడా జరగొచ్చు.

వాల్వ్ మార్పిడి ద్వారా సమస్యను తగ్గిస్తారు. అయితే దీర్ఘకాలిక చిగుళ్ల వ్యాధికి కారణమయ్యే బ్యాక్టీరియా 'పోర్ఫిరోమోనస్ గింగివాలిస్'కీ, ఈ గుండె కవాటాల్లో జరిగే మార్పులకీ సంబంధం ఉన్నదన్నది ఈ పరిశోధన. ఈ సూక్ష్మజీవి తొలుత చిగురు వాపు, కణజాలం క్షీణించడానికి కారణం అవుతుంది. అది మరింత ముదిరితే పీరిడోంటల్ డిసీజ్‌గా పిలుస్తారు. అంటే ఈ చిగురు వ్యాధి ముదిరి ఇన్‌పెక్షన్ అయ్యి దంతాల అడుగు భాగం వరకూ వెళ్లి అక్కడ ఎముకను కూడా దెబ్బ తీస్తుంది.

చివరకు పళ్లు కదిలి ఊడిపోయే ప్రమాదం కూడా ఉంది. ఇది రక్తం ద్వారా ప్రవహించి బృహద్ధమనిని ప్రభావితం చేస్తున్నట్టు ఇటీవలిఅధ్యయనం తేటతెల్లం చేస్తన్నది. కాబట్టి చిగుళ్ల వ్యాధిని సాధ్యమైనంత త్వరగా నయం చేసుకోవాలనీ, అసలు బ్యాక్టీరియా ప్రభావానికి గురికాకుండా ఉండేలా నోటిని శుభ్రంగా ఉంచుకోవాలనీ వైద్యులు సూచిస్తున్నారు. లేకపోతే అది ఏకంగా ప్రాణాలకే ముప్పుగా మారవచ్చునీ హెచ్చరిస్తున్నారు